# కృష్ణార్పణం

మద్రాస్ - కాకినాడ సర్కార్ ఎక్స్‌ప్రెస్, పాసెంజర్‌కన్నా నెమ్మదిగా వెడుతున్నది.

ఆ కంపార్ట్ మెంట్‌లో వున్న జనం కొందరు రకరకాల విషయాలమీద చర్చలతోనూ, కొందరు ప్రకృతి ఆస్వాదనలోనూ, కొందరు ఏవో పుస్తకాలు చదువుకుంటూనూ కొందరు మెల్లగా వెడుతున్న ట్రెయిన్ మీద విసుక్కుంటూను కూర్చుని వున్నారు.

అప్పుడే వాళ్ళ కళ్ళ ఎదుట పడింది ఆ అమ్మాయి.

నల్లగా వుండి మురికి కొట్టుకుని వుంది

శరీరానికి మాసిన ఒక డ్రాయర్ తప్ప వేరే ఏమీలేదు.

తైల సంస్కారంలేని జుట్టు చిందర వందరగా వుంది.

కళ్ళల్లో కళ లేదు - ప్రాణాలు పెట్టుకుని వుంది.

ఆ అమ్మాయికి అయిదారేళ్ళ వయసుంటుందెమో.

పొట్టలోపలకు పోయి ఎముకలు స్పష్టంగా కనపడుతున్నాయి.

నీరసంగా నడుస్తున్నది.

యింకా నీరసంగా ఓ పైసా దర్మం చేయమని అడుగుతున్నది.

ఎవరూ ఆ అమ్మాయిని పట్టించుకోవటం లేదు.

"మూడురోజుల నుంచీ ఏమీ తినలేదు బాబూ - ఒక్కపైసా ముష్టివేయండీ బాబూ' పళ్లు లేని ముసలాయన, పైకి వినపడనంత మెల్లగా సణుక్కుని, చేతిలోని

భగవద్గీతను చదువుకుంటున్నాడు.

"గొంతు ఆరిపోతున్నదమ్మా - ధర్మం చేయండి తల్లీ"

ఆ మహా యిల్లాలు మహా కోపంగా చూసింది.

"బాబూ - దర్మం"

కొత్తపెళ్ళాం నున్నటి భుజాలకు అనుకుని కూర్చున్న కళ్ళజోడు ఆయన విసుక్కున్నాడు.

"అమ్మా - ముష్టి"

"ఛీ ముదనష్టపు ముష్టివాళ్ళు" పట్టుచీర ఆవిడ కసురుకున్నది.

"అమ్మా - ఆకలి-"

"అయ్యా - ఆకలి"

"ప్రాణాలు పోతున్నాయి తల్లీ"

"తిండిలేక చచ్చిపోతున్నాను తండ్రీ"

ఆ అమ్మాయి మాటలు, కృష్ణా బ్రిడ్జి మీద ట్రెయిన్ 'టక్ టక్' మని పెద్దగా చేస్తున్న శబ్దంతో కలసి పోతున్నాయి.

క్రింద పారుతున్న కృష్ణానది, కాన్పుకి పుట్టింటికి వచ్చిన నిండు చూలాలూ వుంది.

భగవద్గీత ప్రక్కన పెట్టి ముసలాయన కృష్ణానదికి నమస్కారం చేశాడు. చొక్కా జేబులోంచి పావలా కాసు తీశాడు.

ముష్టి అమ్మాయి ఆశగా, అబగా ఆయన్నే చూస్తున్నది.

గబుక్కున ఆయన ఆ పావలా కాసుని కృష్ణవేణి నదీ గర్భంలోకి విసిరేసి ఆ పుణ్యనదికి దణ్ణం పెట్టుకుంటూ 'కృష్ణార్పణం' అన్నాడు.

తళుక్కున ఆ అమ్మాయి కళ్ళ ముందు మెరిసిన పావలా కాసు నీళ్ల పాలయింది.

ఆయన రెట్టింపు అయిన పుణ్యంతో, మళ్ళీ భగవద్గీత చదువుకుంటున్నాడు.

మహాయిల్లాలు లేచి "నదీమతల్లీ - మమల్ని కాపాడు!" అంటూనే చెంగున దోపిన, పది పైసలు తీసి నీళ్ళలో వేసింది.

అనుకుని వున్న మొగుణ్ణి, బంగారు గాజులు నిండిన చేతులతో సుతారంగా ప్రక్కకుతోసి, ఎర్రటి హాండ్‌బాగ్‌లో నించి అర్ధ రూపాయి బిళ్ల తీసి, నీళ్ల పాలు చేసి, మళ్ళీ అతన్ని ఆనుకుని, అతని కళ్లల్లోకి గోముగా చూసింది కొత్త పెళ్ళాం.

అతను ఆమె కళ్లల్లో కొత్త పుణ్యం కోసం వెదుకుతున్నాడు.

పట్టుచీర ఆవిడకూడా, పావలా కాసుతో పాటూ పసుపూ కుంకుమా కూడా నీళ్ళల్లో వేసి, నమస్కారం చేసింది.

ట్రెయిన్ కృష్ణానదిని దాటిన తర్వాత, విజయవాడ స్టేషన్‌లో ఆగింది.

ముష్టి అమ్మాయి, తన దురదృష్టాన్ని తలుచు కుంటూ, నీరసంగా ట్రెయిన్ దిగబోయింది. కళ్లు తిరిగి ఫ్లాట్‌ఫారం మీద స్పృహ తప్పి దబేల్ మని పడిపోయింది.

ముసలాయన భగవద్గీతలో నించి తల ఎత్తి చూసి "కృష్ణార్పణం" అని మళ్ళీ భగవద్గీత చదవటంలో మునిగి పోయాడు.

*